ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

ముఖ్యాంశాలు

- కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు.
- బాణసంచా కేంద్రంలో పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
- విశాఖ ఎకనామిక్ రీజియన్ ను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- రైతులు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయల నిధులతో ఐదు వేలకు పైగా ఆలయాలను నిర్మించనున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు.

====================

ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించారు. 14 ఏళ్ల బాలికలకు ముఖ్యమంత్రి సమక్షంలో ఏఎన్‌ఎమ్‌లు వ్యాక్సిన్ వేశారు. వ్యాక్సినేషన్ వల్ల క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారని ముఖ్యమంత్రి విద్యార్థినులకు వివరించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. బాలికలంతా ఈ వ్యాక్సిన్ వేసుకునేలా బాధ్యత తీసుకోవాలని తల్లితండ్రులకు విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ లో 6 శాతం మొత్తాన్ని ఆరోగ్య రంగానికి వ్యయం చేసేలా 19వేల 300 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. పేదలకు ఆసరా ఉండాలనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ ...

(వాయిస్…30 సెకన్లు)

====================

కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ పరిశ్రమలో ఈరోజు భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది క్షతగాత్రులు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ఇప్పటి వరకు 13 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు.

====================

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా కేంద్రంలో సంభవించిన పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. విజయనగరం నుంచే ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుతం

అక్కడ అందుతున్న సహాయక చర్యలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. బాధితులకు అవసరమైన తక్షణ సాయం అందించాలని అధికారులకు సూచించారు. మంత్రులు, ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లిలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అక్కడ ఉన్న హోం మంత్రి అనిత సంఘటనా స్థలికి బయల్దేరి వెళ్లారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి నారా లోకేశ్ హామీఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని నారా లోకేశ్ సామాజిక మాధ్యమం వేదికగా తెలిపారు.

====================

రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా జి.సాయి ప్రసాద్ ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సిఎస్ గా పనిచేసిన కె.విజయానంద్ పదవీ విరమణ చేస్తుండడంతో.. సాయి ప్రసాద్ సిఎస్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ఎస్.ఎస్.రావత్, యం.టి.కృష్ణ బాబు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖాధిపతులు సిఎస్ కు శుభాకాంక్షలు తెలిపారు.

====================

రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరగాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ లో పౌర సరఫరాల శాఖ అధికారులతో ఈరోజు ప్రాంతీయ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, రైతులు పండించిన ప్రతి గింజకు న్యాయమైన ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారహితంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

====================

విరామం

====================

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం పరిధిలోని ప్రత్యేక ఆర్థిక మండలిలో ఫార్మా కంపెనీ బ్లూ జెట్ హెల్త్ కేర్ ఏర్పాటుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఈరోజు శంకుస్థాపన చేశారు. బ్లూ జెట్ పరిశ్రమ 2వేల 300 కోట్ల రూపాయల పెట్టుబడితో యూనిట్ ను ఏర్పాటుచేయనుంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రను ఎకనామిక్ హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ ను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. దేశంలో ప్రముఖ ఔషధ తయారీ రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నారా లోకేష్ పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

ప్రపంచ భాషలలో తెలుగు భాషకు ఎంతో ప్రత్యేకత ఉందని, మన భాష మన ఉనికిని ప్రతిబింబిస్తుందని ఒడిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరుగుతున్న 'ప్రపంచ తెలుగు మహాసభల'లో ఆయన మాట్లాడుతూ గోదావరి తీర ప్రాంతం ఎందరో మహోన్నత పండితులకు, కవులకు, కళాకారులకు పుట్టినిల్లని కొనియాడారు. కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు తెలుగు తప్పనిసరి చేయాలన్నారు. ప్రతిఒక్కరూ మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని అయ్యన్నపాత్రుడు పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

====================

రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయల నిధులతో ఐదు వేలకు పైగా ఆలయాలను నిర్మించనున్నట్లు దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అనుమసముద్రంపేట మండలం వేల్పులగుంటలో శ్రీవాణి నిధులతో నిర్మించనున్న శ్రీ వినాయకస్వామి దేవస్థానానికి మంత్రి ఈరోజు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 5 వేలకుపైగా ఆలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ధూప దీప నైవేద్యం పథకం ద్వారా ప్రతి ఆలయ అర్చకుడికి నెలకు పది వేల రూపాయాలు చెల్లిస్తున్నామన్నారు.

====================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈరోజు కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలలను ప్రత్యేక ప్రచార, అమలు దశగా ప్రకటించామన్నారు. వారం వారీ లక్ష్యాలను నిర్దేశించుకొని గృహాలపై సౌర యూనిట్ల ఏర్పాటు పనులను ముమ్మరం చేయాలని సూచించారు.

====================

2026–27 ఆర్థిక సంవత్సరానికి 5వేల 456 కోట్ల రూపాయల బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపిందని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) చైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో ఎం.రవిచంద్రతో కలిసి ఈరోజు ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తొలిసారిగా తిరుమల తిరుపతి దేవస్థానం విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను 118 కోట్ల 89 లక్షల రూపాయలు కేటాయించామన్నారు. శ్రీవారికి ముడుపులు అందించే దాతల సౌకర్యార్థం శ్రీవారి ముడుపు పత్రం పథకాన్ని ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక సాంకేతికతతో నిర్మిస్తామని చెప్పారు.

====================

జనగణన–2027 పై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులకు సూచించారు. భారత జనగణన–2027 తొలి దశలో భాగంగా నిర్వహించనున్న గృహ జాబితా, గృహ జనగణన కార్యక్రమాల నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఈరోజు కలెక్టర్ మాట్లాడారు. జనగణన–2027 కు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్యూమరేటర్లు ఫీల్డ్ స్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి, నిర్దేశిత విధానాల ప్రకారం ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు.

====================
====================